క్లుప్తంగా

రేణుకా చౌదరికి సన్మానం



రేణుకా చౌదరి దంపతులను సన్మానిస్తున్న భుజంగరెడ్డి

ఎల్‌బీనగర్: రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రేణుకా చౌదరిని గురువారం రెడ్డి సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సంరెడ్డి భుజంగరెడ్డి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.రేణుకా చౌదరి దంపతులను గజామాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పురాతన బావిని పునరుద్ధరించాలి



డిప్యూటీ కమిషనర్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణపురం కాలనీలోని పార్కులో వున్న పురాతన బావి పూడిక తీసి పునరుద్ధరణ కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పున్న గణేశ్ నేత గురువారం జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామకృష్ణపురం కాలనీలోని పార్కులో వున్న పురాతన బావి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేపురం కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా మారిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం డివిజన్ శక్తినగర్ కాలనీకి చెందిన ఐతరాజు రాజు కుమార్తె హర్షిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం కోసం కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహాయాదవ్ సహాయంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశారు. రూ. 2,50 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం మధుయాష్కీగౌడ్ బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహికాలనీ నార్త్ ఓనర్స్ సంఘం, సాయిస్థలి, రంగారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ సోసైటీలు సంయుక్తంగా గురువారం సాయిబాబా దేవాలయ అవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో 50సంవత్సరాలు దాటిన మహిళలకు, 60సంవత్సరాలు దాటిన పురుషులకు, జీహెచ్‌ఎంసీ కార్మికులకు ఉచితంగా వివిధ పరీక్షలు నిర్వహించారు.సమస్య ఉన్న వారికి నెలకు సరిపడా మందులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు నాగరాజు, రాజేందర్‌రెడ్డి, వేణుగోపాల్, విద్యాసాగర్, రాంమోహన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్‌లో నేడు (శుక్రవారం) చేపట్టబోయే ప్రజాసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. సా.4గంటలకు భారత్ పెట్రోలియం బంక్ నుంచి వెళ్లే యాత్రలో బీజేపీ జాతీయ కార్యవర్గం సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి పాల్గొంటారని పేర్కొనారు. కార్యక్రమంలో బూత్ స్థాయి అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నిధుల్లేక నిలిచిన పనులు!

అసంపూర్తిగా మహిళా మండలి భవనం

- ఆరు నెలలుగా స్లాబ్‌కే పరిమితం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న మహిళలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నిధుల లేమితో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పాటు అధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ పరిధిలోని హుడాకాంప్లెక్స్‌లో మహిళా సమాఖ్య భవనానికి ఆరు నెలల క్రితం స్లాబు వేశారు. మిగతా పనులు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పనుల నిర్వహణ కోసం జీహెచ్‌ఎంసీ నుంచి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గతేడాది జూన్ 2న పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. భవనం లేకపోవడంతో సభలు, సమావేశాలకు అవస్థలు పడుతున్నామని, ఇప్పటికే మంజూరైన నిధులను కొత్త ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మహిళా సమాఖ్య సభ్యులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.



అసంపూర్తిగా దర్శనమిస్తున్న మహిళా మండలి భవనం



శంకుస్థాపన సమయంలో వేసిన శిలాఫలకం

❝ నిధులు విడుదల చేయాలి..

నిధులు లేకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పార్కుల్లో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారింది. కొత్త ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయడంతో పాటు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– ఆకుల శ్రీవాణి, కార్పొరేటర్, సరూర్‌నగర్



కొత్తపేటలో సిరి మాల్, జ్యువలరీ షోరూం



షాపింగ్ మాల్, జ్యువలరీ షోరూంను ప్రారంభిస్తున్న రష్మీ

హుడాకాంప్లెక్స్: క్వాలిటీ జ్యువలరీ, కంచిపట్టు వస్త్రాలు మార్కెట్ ధర కన్నా తక్కువకు ఒకే చోట లభిస్తున్నాయని, కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సినీనటి, యాంకర్ రష్మీ అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ కొత్తపేట పరిధి లక్ష్మీనర్సింహపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సిరి షాపింగ్ హాల్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం రష్మి మాట్లాడుతూ.. అన్ని శుభకార్యాలకు అవసరమైన నగలు, వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టెంపుల్ జ్యువలరీ బాగా నచ్చాయని తెలిపారు. కొత్తపేటలో తమ స్టోర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని సిరి షాపింగ్ మాల్, సిల్క్స్ నిర్వాహకులు శనపతి రమేశ్, చేతన్ తెలిపారు.

ఆలయ అర్చకులకు అండగా ఉంటా

జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



విరాళం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్:మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో నిత్య పూజలు గావిస్తున్న అర్చకులకు అండగా ఉంటానని, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాదికి సంబంధించిన రూ.60 వేలను, ఆలయ అర్చకులకు గురువారం అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలో పనిచేసే అర్చకులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు, తన జీవితాంతం ప్రతి సంవత్సరం రూ.60 వేలను ఆలయ అర్చకులకు అందజేస్తానన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఆలయ చైర్మన్ ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ ఉన్నారు.

సేవాగుణాన్ని పెంచే స్కౌట్స్ అండ్ గైడ్స్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులలో సేవా గుణాన్ని పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగపడుతుందని రంగారెడ్డి జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రెజరర్ నారాయణరెడ్డి, జిల్లా కమీషనర్ సి.హెచ్ మినేందర్‌రావు అన్నారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్ హరిపురికాలనీలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో లార్డ్ బెడన్ పవల్స్ జన్మదినం సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కమీషనర్ ఇందిరారెడ్డి, జిల్లా ఆర్గనైజర్ కమీషనర్ శ్రీనివాస్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

- కండువాలు వేసి ఆహ్వానించిన కేఎల్లార్
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపు



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బాచుపల్లి, జైత్వారం నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లి, జైత్వారం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో గురువారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సమక్షంలో హస్తం గూటికి చేరారు. వీరిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కత్తుల వెంకటేశ్‌తో పాటు ఎం.విజయ్, కె.రాజశేఖర్, ఎస్.మహేందర్, కె.మహేందర్, కె.శ్రీశైలం, ఏ.హరికృష్ణగౌడ్, ఎ.శ్రీనివాస్, జహంగీర్, డి.ఈశ్వర్, కె.రమేష్, నవీన్ కుమార్, డి.భిక్షపతి, పి.అంజయ్య, జి.బాబు తదితరులకు కాంగ్రెస్ కండువాలు కప్పిన కేఎల్లార్, వీరిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ బలోపేతానికి కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, మండల కో ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, అందుగుల సత్యనారాయణ, సరికొండ పాండు, ఓర్సు వెంకటేశ్, పి.సిద్ధేశ్వర్‌గౌడ్, ఎస్.జగన్, బి.పాండురంగారెడ్డి, బి.భూపాల్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, వి.నారాయణ, ప్రశాంత్‌కుమార్, పి.కృష్ణ, ఎ.జగదీష్, యుగంధర్‌గౌడ్, ఎం.శేఖర్, వి.బాబు, రాంచంద్రి, పి.శ్రీశైలం, తిరుపతిరెడ్డి, భోజిరెడ్డి, నర్సింహ, కృష్ణారెడ్డి, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మాడ్గుల: మండలం పరిధిలోని ఇర్విన్ గ్రామంలో గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు సూదిని శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా సూదిని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామానికి రూ.20 లక్షలు సీసీరోడ్ల నిర్మాణానికి మంజూరు అయినట్లు చెప్పారు. అలాగే, ఇర్విన్ గ్రామ పరిధిలోని రెడ్డిపురం గ్రామానికి రూ.5 లక్షలు, దిల్‌వర్ ఖాన్‌పల్లి, గ్రామానికి రూ. 5లక్షలు మంజూరు అయ్యాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ నాయకులు చంద్రయ్య, వెంకటేశ్ గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, శివగౌడ్, శ్రీశైలం , పర్వతాలు, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

తలకొండపల్లి: కల్వకుర్తి పట్టణంలోని కేసీఆర్ ఫంక్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిలుగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లురవి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహ్మారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఎమ్మెల్యేలు, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజి సింగ్ హాజరవుతున్నారని మోహన్‌రెడ్డి చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తలు, బీఎల్‌ఓలు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు నాయకులు అందరు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభించి, క్రికెట్ ఆడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: గ్రామాల్లో క్రీడలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆరుట్ల గ్రామంలో యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిభను చాటేలా ఆడాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో కలిసి మెలసి ఆడుకోవాలన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. గ్రామీణస్థాయి నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదిగారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కావలి శ్రీనివాస్, నాయకులు గుడ్డిమల్లచంద్రయ్య,మార సురేష్, రమణారెడ్డి, సురేష్, భాస్కర్, అశోక్, సికిందర్‌రెడ్డి, నాగరాజు, రాఘవేందర్, శ్రీనివాస్, శంకర్, రాయుడు,ప్రవీణ్, శివ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నర్సింగ్ సిబ్బంది

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం నూతన నర్సింగ్ సిబ్బంది విధుల్లో చేరారు. ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి 14 మంది నర్సింగ్ సిబ్బందిని కేటాయించారు. డా.జయశ్రీ, డా.మంజులాదేవి సమక్షంలో భూలక్ష్మి, గాయత్రి, సాయిలక్ష్మి, రేణుక, అనూష, జ్యోతిమేరి విధుల్లో చేరారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాచారం: మండలంలోని కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గోదాదేవి పద్మావతి, వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉ.8 గంటల నుంచి నాదస్వర సుప్రభాతం, పంచామృత అభిషేకం , సహస్రనామవళి పూజ, మంగళహారతి, మంత్ర పుష్పం పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణోత్సవం నిర్వహించారు. గోవిందా నామస్మరణలతో దేవాలయ ఆవరణ మార్మోగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తీసుకోని వారికి జరిమానా

కమిషనర్ సత్యనారాయణరెడ్డి



వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని వ్యాపారులంతా సంస్థలకు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని పుర కమిషనర్ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఫిబ్రవరిలో వ్యాపార లైసెన్సలను తీసుకోని పక్షంలో 50 శాతం జరిమానా విధించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడంతో కమిషనర్ వారిని అభినందించారు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని మహోనియా ఆస్పత్రి, వైష్ణవి, బాలాజీ, కీర్తన కోల్డ్ స్టోరేజీ, ఆగ్ర స్వీట్స్, ఎస్‌వీఆర్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్స్, కావ్య సిరామిక్స్ వ్యాపార సంస్థలకు నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, వినయ్‌కుమార్, ఇఇ హరీశ్, సిబ్బంది భానుమతి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే!



ఉత్సవ మూర్తులు

- కనుల పండువగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం
- హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ప్రజాప్రతినిధులు, భక్తులు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం భక్తుల జయజయ ధ్వనుల మధ్య గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో కల్యాణోత్సవం కోసం ఏర్పాటు చేసిన మండప వేదిక అందంగా, పచ్చటి మామిడి తోరణాలతో, తమల పత్ర పుష్పాలతో చూడముచ్చటగా, కడురమణీయంగా అలంకరించారు. అంతకు ముందు బ్యాండు మేళాల తో స్వామివారి తలంబ్రాలు, పట్టువస్త్రాలకు ఊరేగింపు నిర్వహించి, ఆలయానికి తీసుకువచ్చారు. స్వామివారికి పట్టు వస్త్రాలను కందికంటి సుధాకర్‌గౌడ్ బహూకరించగా, పుస్తె మెట్టెలను కృష్ణమూర్తి అందజేశారు. వేడుకల కోసం చెన్నకేశవస్వామిని, భూదేవి అమ్మవారి విగ్రహాలను పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలోని పండిత బృందం వేద మంత్రోచ్చరణల మధ్య లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం మహోత్సవ వేడుకలను భక్తజనుల గోవింద నామస్మరణ మధ్య కనుల పండువగా సాగింది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆలయాన్ని సందర్శించిప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అనంతరం భాస్కర్‌రెడ్డి భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అభివృద్ధికి అందరూ సహకరించాలి

జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ కృపేష్



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెట్పీటీసీ

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలని జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ కృపేష్‌లు పేర్కొన్నారు. మండలం పరిధిలోని కప్పపహాడ్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ మహిపాల్‌లు ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలంతా కలిసి కట్టుగా ఉండి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భరత్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఇంద్రాసేనారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హంసమ్మ, మాజీ ఉప సర్పంచ్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.